సీఎం కప్‌లో ఆంధ్రా ఆధిపత్యం

తెలంగాణ ప్లేయర్లను బయటకు పంపిన వైనం

ప్రశ్నించిన వారిపై దాడి చేసిన నిర్వాహకులు ● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

జూబ్లీహిల్స్, జనవరి1: తెలంగాణ సీఎం కప్ కరాటే పోటీలలో ఆంధ్రా ఆధిపత్యం నడుస్తున్నది. తెలంగాణ క్రీడాకారుల ఆత్మ గౌరవాన్ని ఇనుమడింపచేసే సీఎం కప్ క్రీడలు ఆంధ్ర లాబీయింగ్‌తో పక్కదారి పడుతున్నాయి. ప్రశ్నించిన వారిపై దాడికి తెగబడి తెలంగాణ క్రీడాకారులను బయటకు పంపిన సంఘటన యూసుఫ్‌గూడ ఇండోర్ స్టేడియంలో బుధవారం చోటు చేసుకుంది. గతనెల 31న మొదలైన సీఎం కప్ కరాటే పోటీలలో గ్రామీణ క్రీడాకారులకు తీవ్ర అన్యాయం చేశారని ప్లేయర్లు, కోచ్‌లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కరాటే పోటీల అండర్ 14-15 కుమిటీ విభాగంలో జగిత్యాలకు చెందిన శివ అనే ప్లేయర్ ముందుగా విజేతగా ప్రకటించి ఆ తర్వాత ఓడిన ప్లేయర్‌ను గెలిచినట్లు ప్రకటించారని కోచ్ పవన్ పేర్కొన్నాడు. సంగారెడ్డి ప్లేయర్ చేతిలో ఓడిన ప్లేయర్‌ను తిరిగి పెద్దపల్లి నుంచి పోటీకి దింపడంతో పాటు తెలంగాణ వారికి ఫలితాల్లో తీవ్ర అన్యాయం చేయడంతో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. జరిగిన అన్యాయంపై ప్రశ్నించినందుకు ఆంధ్రకు చెందిన సీఎం కప్ క్రీడల కార్యదర్శి కీర్తన్‌తో పాటు స్టేడియం ఇన్‌చార్జ్ అలెగ్జాండర్ తమపై దాడికి దిగినట్లు ప్లేయర్లు గోడు వెల్లబోసుకున్నారు. జగిత్యాలకు చెందిన 19 మంది ప్లేయర్లు సీఎం కప్ క్రీడలను బహిష్కరించడంతో పాటు జూబ్లీ హిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇవి తెలంగాణ సీఎం కప్ పోటీలు కావని, ఆంధ్ర సీఎం కప్ టోర్నీ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ బైఠాయించారు. తెలంగాణ క్రీడలపై ఆంధ్రవాళ్ల ఆధిపత్యం ఇంకా కనిపిస్తున్నదని పలువురు ప్లేయర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

సీనియర్లపై గంభీర్ గుర్రు

బహుత్ హోగయా!

టీమ్‌ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు ● కెప్టెన్, కోచ్, సెలక్షన్ కమిటీ మధ్య అసఖ్యత

అశ్విన్ ఆకస్మిక రిటైర్మెంట్ వెనుక హస్తమెవరిది? ● జట్టులో లుకలుకలపై బీసీసీఐ ఆందోళన

సిడ్నీ: టెస్టులలో వరుస ఓటములు.. సొంత గడ్డపై అవమానకర రీతిలో సిరీస్ (కివీస్ చేతిలో) క్లీన్‌స్వీప్.. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్తు గల్లంతు! సీనియర్ల వైఫల్యం.. తదితర పరిణామాల అనంతరం మరో వార్త భారత క్రికెట్ అభిమానులను కలవరపాటుకు గురిచేస్తోంది. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా మెల్‌బోర్న్ టెస్టు ఓటమి తర్వాత టీమ్‌ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు పొడచూపాయని జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. పలువురు సీనియర్ ఆటగాళ్ల బాధ్యతారాహిత్యమైన ఆటతీరుపై ప్రధాన కోచ్ గౌతం గంభీర్ తీవ్ర ఆగ్రహంగా ఉన్నాడని.. బాక్సింగ్ డే టెస్టు ముగిసిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో ఇద్దరు ముగ్గురు ఆటగాళ్లతో 'ఇక చేసింది చాలు' (బహుత్ హోగయా!) అని మండిపడ్డట్టు సమాచారం. అంతేగాక గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మ, సెలక్షన్ కమిటీ మధ్య కూడా సఖ్యత లోపించిందని.. వీరందరూ ముఖాలు చూసుకోవడానికీ ఇష్టపడనంతగా నొచ్చుకున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

ఇక ఆడకుంటే వేటే..

గతేడాది జూలై 9న హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గంభీర్.. ఆటగాళ్లతో 'సింక్' అవడం కోసం వారి సహజ ఆటతీరుకు భంగం కలిగించకుండా ఉండేందుకు వారికి ఆరు నెలల పాటు సమయమిచ్చాడని, కానీ పలువురు సీనియర్లు పరిస్థితులకు తగ్గట్టుగా కాకుండా తమకు నచ్చినట్టు ఆడి వికెట్‌ను పారేసుకోవడం అతడికి ఆగ్రహం తెప్పించినట్టు తెలుస్తోంది. రెండో టెస్టు నుంచి అందుబాటులోకి వచ్చిన రోహిత్.. ఈ సిరీస్‌లో ఇప్పటి దాకా రెండంకెల స్కోరు చేయలేదు. పదే పదే పుల్‌షాట్లు ఆడబోయి ఔట్ అవుతున్న అతడు.. బాక్సింగ్ డే టెస్టు రెండో ఇన్నింగ్స్ ఆరంభంలో తన సహజ ఆటతీరును పక్కనబెట్టి మరీ ఆడినా మళ్లీ తన బలహీనతను బయటపెట్టుకున్నాడు. ఇక కోహ్లీ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఆఫ్ స్టంప్ అవతల బంతులను వెంటాడుతూ బలవుతున్నాడు. పెర్త్ టెస్టులో సెంచరీ మినహా ఈ సిరీస్‌లో అతడి ప్రదర్శన దారుణం. రిషభ్ పంత్.. బాధ్యతారాహిత్యమైన షాట్లు ఆడి ఔట్ అవుతున్నాడు. నాలుగో టెస్టు రెండో ఇన్నింగ్స్ సెకండ్ సెషన్‌లో యశస్వీతో బాగానే పోరాడినా మూడో సెషన్‌లో అనవసర షాట్ ఆడటంతో ఆ తర్వాత 34 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి భారత్ ఆలౌట్ అయింది. యశస్వీ, రాహుల్, నితీశ్, వాషింగ్టన్ వంటి ఆటగాళ్ల మినహా మిగిలిన బ్యాటర్ల ప్రదర్శన అంతంత మాత్రమే. ఈ నేపథ్యంలో గంభీర్ సీనియర్ ఆటగాళ్ల ఆటతీరుపై గుర్రుగా ఉన్నాడని.. ఇక నుంచి జట్టు వ్యూహాలు, పరిస్థితులకు తగ్గట్టుగా ఆడని ఆటగాళ్లపై వేటు తప్పదని చెప్పకనే చెప్పినట్టు వినికిడి.

సెలక్షన్ విషయాల్లోనూ అసంతృప్తి..

జట్టు కూర్పు విషయంలోనూ కోచ్, కెప్టెన్, సెలక్షన్ కమిటీ మధ్య మనస్పర్థలు వచ్చినట్టు తెలుస్తోంది. పెర్త్ టెస్టులో గెలిచిన తర్వాత తనకు ఛతేశ్వర్ పుజారా కావాలని, అతడు జట్టులో స్థిరత్వం తీసుకురాగలడని గంభీర్ కోరగా దానికి సెలక్షన్ కమిటీ తిరస్కరించినట్టు తెలుస్తోంది. కొత్త ఆటగాళ్ల వేటలో భాగంగా టీమ్‌ఇండియా.. పుజారా, రహానే వంటి సీనియర్లను ఏడాది క్రితమే పక్కనబెట్టేసిన విషయం తెలిసిందే. పెర్త్ టెస్టులో హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్‌ను ఆడించడం.. పింక్ బాల్ టెస్టుకు ఆకాశ్‌దీప్‌ను తీసుకోకపోవడం వంటి విషయాల్లో గంభీర్‌తో సెలక్షన్ కమిటీ విభేదించినట్టు వార్తలు వస్తున్నాయి.

అశ్విన్ ఎందుకు తప్పుకున్నట్టు?

ఆస్ట్రేలియా సిరీస్ మధ్యలో ఉండగా ఎవరూ ఊహించని విధంగా వెటరన్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అశ్విన్ రిటైర్మెంట్‌లో గంభీర్ పాత్ర ఏంటని కూడా బీసీసీఐ ఆరా తీస్తోంది. మరోవైపు జట్టులో విభేదాలతో కలత చెందిన అశ్విన్.. వీడ్కోలు పలికినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

కెప్టెన్, కోచ్.. మాటల్లేవ్!

జట్టు సెలక్షన్ విషయంలోనూ రోహిత్, గంభీర్ మధ్య ఏకాభిప్రాయం లేదని సమాచారం. గతంలో ఎవరైనా ఆటగాడిని తుది జట్టులోకి తీసుకోకుంటే రోహిత్.. సదరు ప్లేయర్ దగ్గరకు వెళ్లి అతడిని ఎందుకు తీసుకోలేదో చెప్పేవాడు. కానీ ఇప్పుడు మాత్రం అలా చేయడం లేదట! మాజీ కోచ్ ద్రవిడ్‌తో ఉన్న సఖ్యత.. గంభీర్‌తో లేదని సోషల్ మీడియా కోడై కూస్తోంది.

గౌతీకీ కష్టమేనా?

తాజా పరిణామాల నేపథ్యంలో సీనియర్ ఆటగాళ్లతో పాటు గంభీర్ ప్రదర్శనపైనా బీసీసీఐ దృష్టి సారించినట్టు బోర్డు వర్గాల సమాచారం. ఇదే విషయమై బోర్డు ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. 'ఈ సిరీస్‌లో మరో టెస్టు మిగిలుంది. ఫిబ్రవరి-మార్చిలో చాంపియన్స్ ట్రోఫీ ఉంది. ఒకవేళ అప్పటి వరకు జట్టు ప్రదర్శన పురోగతి సాధించకుంటే గంభీర్ స్థానం కూడా సురక్షితం కాదు' అని తెలిపాడు. గంభీర్ సపోర్ట్ స్టాఫ్‌లో భాగమైన బ్యాటింగ్ కోచ్ అభిషేక్ నాయర్ ప్రదర్శనపైనా బీసీసీఐ అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. సిడ్నీ టెస్టు ముగిసిన తర్వాత రోహిత్, గంభీర్‌తో చర్చించనున్న బీసీసీఐ.. ఈ వివాదాలకు ముగింపు పలకాలని భావిస్తున్నా ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని టీమ్ ఇండియా అభిమానులు వాపోతున్నారు.

ఆల్ టైమ్ హై రికార్డుకు బుమ్రా



దుబాయ్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా బ్యాటర్లకు ముచ్చెమటలు పట్టిస్తున్న భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అత్యున్నత రికార్డును సాధించాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకుల్లో బుమ్రా.. 907 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన కొనసాగుతున్నాడు. గతంలో భారత్ నుంచి అశ్విన్ మాత్రమే 904 రేటింగ్ పాయింట్లు సాధించగా తాజాగా బుమ్రా ఆ రికార్డును బ్రేక్ చేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియా పేసర్లు జోష్ హాజిల్‌వుడ్, పాట్ కమిన్స్ టాప్-3లో ఉన్నారు. జైస్వాల్ ఒక ర్యాంక్ మెరుగుపరచుకుని నాలుగో ర్యాంక్‌కు చేరాడు.

బుమ్రా లేకుంటే సిరీస్ ఏకపక్షమే..

గ్లెన్ మెక్‌గ్రాత్

సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత జట్టు నుంచి బుమ్రా లేకుంటే ఈ సిరీస్ ఏకపక్షమయ్యేదని ఆసీస్ మాజీ పేసర్ గ్లెన్ మెక్‌గ్రాత్ అన్నాడు. సిడ్నీలో జరిగిన ఓ కార్యక్రమంలో మెక్‌గ్రాత్ మాట్లాడుతూ.. 'భారత జట్టులో అతడు చాలా కీలకమైన ఆటగాడు. ఒకవేళ అతడే లేకుంటే ఈ సిరీస్ ఏకపక్షమయ్యేది. ఇక్కడ పరిస్థితులను బుమ్రా తొందరగా ఆకలింపు చేసుకున్నాడు. వికెట్‌కు రెండు వైపులా నియంత్రణ కొనసాగిస్తూ వికెట్లు రాబడుతున్నాడు' అని ప్రశంసలు కురిపించాడు.

దవాఖాన నుంచి కాంబ్లీ డిశ్చార్జి

పుణె: ఆరోగ్య సమస్యలతో గత వారం పుణెలోని ఓ దవాఖానలో చేరిన భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లి కోలుకున్నాడు. మూత్రపిండాల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న అతడు.. పూర్తిస్థాయిలో కోలుకున్నాడని కాంబ్లీ ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తున్న డాక్టర్ వివేక్ త్రివేది తెలిపారు. బుధవారం సాయంత్రం కాంబ్లీ దవాఖాన నుంచి డిశ్చార్జి అయ్యాడు.

వైశాలికి కాంస్యం

వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్

న్యూయార్క్: ప్రతిష్ఠాత్మక వరల్డ్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో భారత్ మరోసారి సత్తా చాటింది. ర్యాపిడ్ ఈవెంట్‌లో కోనేరు హంపి చాంపియన్‌గా నిలవగా తాజాగా బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో యువ గ్రాండ్ మాస్టర్ ఆర్ వైశాలి కాంస్యంతో మెరిసింది. ఈ టోర్నీలో కాంస్యం గెలవడం ఆమెకు ఇదే మొదటిసారి కావడం విశేషం. బుధవారం జరిగిన బ్లిట్జ్ నాకౌట్ దశలో వైశాలి.. క్వార్టర్స్‌లో 2.5-1.5తో జు జినర్ (చైనా)ను ఓడించింది. కానీ సెమీస్‌లో 0.5-2.5తో మరో చైనా అమ్మాయి జు వెంజున్ చేతిలో పరాభవం పాలై కాంస్యంతో సరిపెట్టుకుంది. ఫైనల్‌లో వెంజున్.. 3.5-2.5తో తన దేశానికే చెందిన లీ టింగ్జీని ఓడించి టైటిల్ సొంతం చేసుకుంది. కాంస్యం గెలిచిన వైశాలిపై భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ ప్రశంసలు కురిపించాడు. ఇక పురుషుల విభాగంలో నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్, రష్యా ఇయాన్ నెపోమ్‌నియాచి సంయుక్తంగా టైటిల్‌ను పంచుకున్నారు.

ఐహెచ్‌ఎఫ్ టోర్నీకి కోచ్‌గా విష్ణువర్ధన్

హనుమకొండ చౌరస్తా, జనవరి 1: లక్నో వేదికగా ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే ఐహెచ్‌ఎఫ్ పురుషుల కాంటినెంటల్(ఆసియా) టోర్నీకి హనుమకొండకు చెందిన బొడ్డు విష్ణువర్ధన్ కోచ్‌గా ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని జాతీయ హ్యాండ్‌బాల్ అసోసియేషన్(హెచ్ఏఐ) సంయుక్త కార్యదర్శి తేజ్‌రాజ్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోచ్‌గా ఎంపికైనందుకు సహకరించిన హెచ్ఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనందీశ్వర్‌పాండే, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, సాట్స్ ఎండీ సోనీ బాలదేవి, హనుమకొండ డీవైఎస్‌వో అశోక్‌కుమార్‌కు విష్ణు కృతజ్ఞతలు తెలిపాడు. హనుమకొండ డీఎస్ఏ కోచ్‌గా విష్ణు 8 ఏండ్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు.

విజయ్ హజారే ట్రోఫీ కోసం నగరానికి వచ్చిన బీహార్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని బుధవారం అభినందిస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

కొంగొత్త ఆశలతో కొత్త ఏడాదిలోకి..

చిత్రం

గత ఏడాది తెలుగు సినిమా ప్రయాణం సంతృప్తికరంగానే సాగిందని చెప్పొచ్చు. కల్కి, పుష్ప-2 చిత్రాల ద్వారా మరోమారు జాతీయ స్థాయిలో తెలుగు సినిమా సత్తా చాటింది. అపూర్వ విజయాలతో పాటు అనుకోని వివాదాలు చుట్టుముట్టడంతో పరిశ్రమ కాస్త కలవరపాటుకు గురైంది. ఈ నేపథ్యంలో గతాన్ని సమీక్షించుకుంటూ కొంగొత్త ఆశలతో నూతన సంవత్సరాదిలోకి అడుగుపెట్టింది. మరి కొద్ది రోజుల్లో సంక్రాంతి సంరంభానికి తెరలేవబోతున్నది. అగ్ర హీరోల చిత్రాలు ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతున్నాయి. ఈ సందర్భంగా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పలు సినిమాల కొత్త పోస్టర్స్‌ను విడుదల చేశారు. అదే సమయంలో కొన్ని చిత్రాల తాజా అప్‌డేట్స్ కూడా వెలువడ్డాయి. అవేమిటో ఓసారి చూద్దాం..

'మాట వినాలి..' అంటున్న వీరమల్లు

అగ్ర హీరో పవన్‌కల్యాణ్ చారిత్రక యోధుడిగా నటిస్తున్న చిత్రం 'హరిహరవీరమల్లు పార్ట్-1 స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్'. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందిస్తున్న ఈ చిత్రానికి జ్యోతికృష్ణ దర్శకుడు. ఏ.దయాకర్ రావు నిర్మాత. మార్చి 28న పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది. ఈ సినిమాలోని 'మాట వినాలి..' అనే గీతాన్ని ఈ నెల 6న విడుదల చేయబోతున్నారు. కీరవాణి స్వరపరచిన ఈ గీతాన్ని పెంచల్‌దాస్ రచించారు. ఈ పాటను పవన్‌కల్యాణ్ స్వయంగా ఆలపించడం విశేషం. చైతన్య గీతమిదని, యువతలో స్ఫూర్తి నింపే విధంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు.



గేమ్ ఛేంజర్



హిట్-3

రాబిన్‌హుడ్

మనసాగర్ గాడి లవ్వు... మహాలక్ష్మి

రామ్ పోతినేని కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. మహేష్‌బాబు దర్శకుడు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఈ సినిమాలో సాగర్ అనే పాత్రలో రామ్ కనిపించనున్నారు. బుధవారం కథానాయిక భాగ్యశ్రీ బోర్సే ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. దీనిపై 'మన సాగర్‌గాడి లవ్వు..మహాలక్ష్మి' అనే క్యాప్షన్ ఆకట్టుకునేలా ఉంది.

'గేమ్ ఛేంజర్' థియేట్రికల్ ట్రైలర్

శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'గేమ్ ఛేంజర్' ఈనెల 10న ప్రేక్షకుల ముందుకురానుంది. దిల్ రాజు, శిరీష్ నిర్మాతలు. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. యు.ఏ.సర్టిఫికెట్ లభించింది. నేడు థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పాటలు, ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించిందని, రాజకీయ, సామాజికాంశాలను చర్చిస్తూ దర్శకుడు శంకర్ తనదైన శైలిలో సినిమాను రూపొందించాడని మేకర్స్ తెలిపారు. కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతాన్నందించారు.

అర్జున్ సర్కార్ యాక్షన్

నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. సక్సెస్‌ఫుల్ 'హిట్' సినిమా ఫ్రాంఛైజీలో వస్తున్న మూడో చిత్రమిది. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. శ్రీనిధిశెట్టి కథానాయిక. ఇటీవలే కశ్మీర్‌లో ఓ షెడ్యూల్ పూర్తయింది. క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నాని అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జే మేయర్, రచన-దర్శకత్వం: శైలేష్ కొలను.

నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్' కొత్త పోస్టర్‌ను కూడా బుధవారం విడుదల చేశారు.

క్రాక్ చూపించే జాక్..

డీజే టిల్లు ఫ్రాంఛైజీ చిత్రాల సూపర్ సక్సెస్ తర్వాత సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న తాజా చిత్రం 'జాక్' (కొంచెం క్రాక్). బొమ్మరిల్లు భాస్కర్ దర్శకుడు. శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. చిత్రీకరణ తుది దశకు చేరుకుందని, హాస్యప్రధానంగా అలరించే చిత్రమిదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి అచ్చు రాజమణి స్వరకర్త.

జాక్

పాంచ్‌మినార్

గాంధీ తాత చెట్టు

సుకుమార్ తనయ 'గాంధీ తాత చెట్టు'

ప్రముఖ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకురాలు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, గోపీ టాకీస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ నెల 24న విడుదలకానుంది. బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. గాంధీ సిద్ధాంతాలను అనుసరిస్తూ, ఆయన బాటలో నడిచే ఓ పదమూడేళ్ల అమ్మాయి తాను పుట్టిన ఊరి కోసం ఏం చేసిందన్నదే ఇతివృత్తమని, తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు తప్పకుండా చూపించాల్సిన చిత్రమిదని దర్శకురాలు పద్మావతి మల్లాది పేర్కొన్నారు.

రాజ్‌తరుణ్ 'పాంచ్ మినార్'

రాజ్‌తరుణ్ తాజా చిత్రం 'పాంచ్‌మినార్' ఫస్ట్‌లుక్‌ను బుధవారం రిలీజ్ చేశారు. క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. రామ్ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మాధవి, ఎమ్ఎస్ఎమ్ రెడ్డి నిర్మిస్తున్నారు. హైదరాబాద్ నేపథ్యంలో సాగే క్రైమ్ కామెడీ కథాంశమిదని, ఆద్యంతం ఉత్కంఠను పంచుతుందని మేకర్స్ తెలిపారు. రాశీసింగ్, అజయ్‌ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్ రెడ్డి, నితిన్ ప్రసన్న తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆదిత్య జవ్వాది, సంగీతం: శేఖర్‌చంద్ర, రచన-దర్శకత్వం: రామ్ కుడుముల.

అడ్వెంచర్‌కు అంతా సిద్ధం!

రాజమౌళి దర్శకత్వంలో మహేష్‌బాబు కథానాయకుడిగా నటించబోతున్న గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ అప్‌డేట్ కోసం దేశవ్యాప్తంగా అభిమానుల్లో ఆసక్తినెలకొని ఉంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రాజమౌళి డైరెక్ట్ చేస్తున్న సినిమా ఇదే కావడం, ఆయన దర్శకత్వంలో మహేష్‌బాబు తొలిసారి నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్ హైప్ క్రియేట్ చేస్తున్నది. ఈ సినిమా ఎప్పుడు లాంచ్ అవుతుందోనని అభిమానులు ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు. జనవరిలో పట్టాలెక్కనుందని గతంలోనే వార్తలొచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం నేడు హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ఈ సినిమాను మొదలుపెడతారని తెలిసింది. అందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని ఫిల్మ్‌నగర్ వర్గాల్లో వినిపిస్తున్నది. సాధారణంగా ప్రతీ సినిమా ప్రారంభానికి ముందు ప్రెస్‌మీట్ పెట్టి ప్రాజెక్ట్ వివరాలను వెల్లడించడం రాజమౌళి ఆనవాయితీ. మరీ ఈ సినిమా విషయంలో ఆయన అదే పద్ధతి ఫాలో అవుతారో లేదో వేచిచూడాల్సిందే. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమా కోసం వెయ్యికోట్ల బడ్జెట్ కేటాయించారని వార్తలొస్తున్నాయి. కీరవాణి సంగీతాన్నందించనున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మించనున్నారు.

7జీ బృందావన కాలనీ సీక్వెల్

రెండు దశాబ్దాల క్రితం హృద్యమైన ప్రేమకథా చిత్రంగా ప్రేక్షకుల్ని మెప్పించింది '7జీ బృందావన కాలనీ'. దీనికి సీక్వెల్‌గా '7జీ బృందావన కాలనీ-2' తెరకెక్కుతున్నది. ఏ.ఎం.రత్నం నిర్మాత. సెల్వరాఘవన్ దర్శకుడు. చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. తొలిభాగంలో తన నటనతో ఆకట్టుకున్న హీరో రవికృష్ణ సీక్వెల్‌లో మరోసారి తనదైన శైలిలో మెప్పించడానికి సిద్ధమవుతున్నారని, ఆయన సరసన అనశ్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నదని మేకర్స్ తెలిపారు. బుధవారం నూతన ఏడాదిని పురస్కరించుకొని కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. నేటి యువతరం అభిరుచులకు తగ్గట్టుగా సీక్వెల్‌ను రూపొందిస్తున్నామని, అప్పటి మ్యాజిక్‌ను రిపీట్ చేస్తామనే నమ్మకం ఉందని నిర్మాత ఏ.ఎం.రత్నం తెలిపారు. జయరామ్, సుమన్‌శెట్టి, సుధ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి యువన్‌శంకర్‌రాజా సాహిత్యాన్నందిస్తున్నారు.

ఏదో.. ఏ జన్మలోదో..

రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'షష్టిపూర్తి'. క్లాసిక్ ఫిల్మ్ 'లేడీస్ టైలర్' విడుదలైన 38ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న సినిమా ఇదే కావడ విశేషం. ఇందులో రూపేష్, ఆకాంక్షసింగ్ నాయకానాయికలుగా నటిస్తున్నారు. పవన్‌ప్రభ దర్శకుడు. ఈ సినిమాలోని 'ఏదో ఏ జన్మలోదో..' అనే గీతాన్ని త్వరలో విడుదల చేయబోతున్నారు. ఇళయరాజా స్వరపరచిన ఈ గీతానికి కీరవాణి సాహిత్యాన్ని సమకూర్చడం విశేషం. దర్శకుడు ఈ పాట విశేషాలు తెలియజేస్తూ 'ఈ సినిమాలో ఐదు పాటలున్నాయి. అందులో ఓ పాటను కీరవాణితో రాయిస్తే బాగుంటుందనుకున్నాం. సందర్భం చెప్పి రాయమని రిక్వెస్ట్ చేయగా ఆయన అంగీకరించారు. ఇసైజ్ఞాని ఇళయరాజా బాణీకి ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సాహిత్యాన్ని అందించడం, అది మా సినిమాలో పాట కావడం ఆనందంగా ఉంది. కీరవాణి ఇప్పటివరకు ఎన్నో పాటలు రాశారు..కానీ ఇళయరాజా బాణీకి రాయడం ఇదే ప్రథమం. ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్లో ఉంది' అన్నారు. అచ్యుత్ కుమార్, సంజయ్ స్వరూప్, రాజ్ తిరందాసు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, నిర్మాత: రూపేష్ కుమార్ చౌదరి.

'కాంచన-4'లో నాయికగా

రెండేళ్లుగా మంచి విజయం కోసం నిరీక్షిస్తోంది అగ్ర కథానాయిక పూజా హెగ్దే. గత ఏడాది ఈ భామ తెరపై కనిపించలేదు. సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉండాలని నిర్ణయించుకున్నానని, అందుకే కాస్త బ్రేక్ తీసుకున్నానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. ప్రస్తుతం ఈ భామ భారీ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. తమిళంలో దళపతి విజయ్, సూర్య చిత్రాల్లో నాయికగా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నది. ఈ సినిమాలు తనకు బ్రేక్‌నిస్తాయని, నాయికగా తిరిగి పూర్వ వైభవాన్ని సొంతం చేసుకుంటానని ధీమా వ్యక్తం చేస్తోంది. తాజాగా ఈ అమ్మడు తమిళంలో మరో బంపరాఫర్‌ను చేజిక్కించుకుంది. రాఘవ లారెన్స్ 'కాంచన-4' చిత్రంలో పూజా హెగ్దే కథానాయికగా నటించనుందని గత కొద్దినెలలుగా వార్తలొస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఆమె దాదాపుగా ఖరారయ్యారని తెలిసింది. ఇందులో పూజాహెగ్దే డెవిల్ రోల్‌లో నటించనుందని అంటున్నారు. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.